దివ్యాంగుల హక్కు చట్టం అమలు చేయాలి



అనితా రామచంద్రన్‌కు వినతిపత్రం ఇస్తున్న దివ్యాంగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు

రాయదుర్గం: దివ్యాంగుల హక్కు చట్టం -2016ను పూర్తి స్థాయిలో అమలు చేయాలని కోరుతూ రాష్ట్ర మహిళా, శిశు, దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్యదర్శి అనితారామచంద్రన్‌కు గురువారం వినతిపత్రాన్ని అందించారు. దివ్యాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకల అశోక్‌కుమార్ ముదిరాజ్ వినతిపత్రాన్ని రాష్ట్ర సచివాలయంలో కార్యాలయంలో ఆమెకు అందించారు. దివ్యాంగుల హక్కుల చట్టాన్ని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో , గ్రామ, మండల, జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయాల్లో అమలయ్యే విధంగా చూడాలని కోరారు. అందులో 92 సెక్షన్‌పైఅధికారులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని కోరారు.

నూతన మేనేజర్ల బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న, శ్రీనివాస్‌రెడ్డి

చందానగర్: హఫీజ్‌పేట్‌లోని జలమండలి కార్యాలయంలో నూతన జనరల్ మేనేజర్లు గురువారం బాధ్యతలు స్వీకరించారు. చార్మినార్ డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్న రమావత్ కృష్ణ దుర్గం చెరువు డివిజన్ 15 జీఎంగా, కొంపల్లి డివిజన్ నుంచి పి.శ్రీనివాస్‌రెడ్డి హఫీజ్‌పేట్ డివిజన్ 17 జీఎంగా బాధ్యతలు తీసుకున్నారు.

కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నేతలు



నిజాంపేట్: జిల్లా కలెక్టర్‌గా మను చౌదరి నూతనంగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా గురువారం పలువురు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కలెక్టర్‌ను కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా అనుమతులు పొందిన సంస్థపై చర్యలు తీసుకోవాలి



కార్పొరేషన్ మేనేజర్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

నిజాంపేట్: ప్రభుత్వ భూముల్లో ఓ ప్రైవేట్ నిర్మాణ సంస్థ అనుమతులు రద్దు చేయాలని గురువారం ఆకుల సతీష్ నిజాంపేట్ కార్పొరేషన్ మేనేజర్ పవన్ కుమార్‌ను కలిసి వినతి ప్రతం అందజేశారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో ప్రగతినగర్ సాయినగర్ కమాన్ ఆనుకుని సర్వే నంబర్ 141 ప్రైవేట్ ల్యాండ్‌లో భూమి చూపిస్తూ సర్వే నంబర్ 142 ప్రభుత్వ భూమి 6.5 గుంటలు ఆక్రమించుకుని అక్రమ అనుమతులు పొందిన నిర్మాణ సంస్థపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో అరుణ్‌రావు, ఈశ్వర్‌రెడ్డి, ముఖేష్, ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరం

కుత్బుల్లాపూర్: రోడ్డు భద్రత, ట్రాఫిక్ రూల్స్‌పై పాఠశాల స్థాయి నుండే అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం జీడిమెట్లలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థులతో అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలపై ప్లకార్డులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏసీపీ వెంకట్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ప్రధాన రహదారిలో రోడ్డు దాటే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, సిగ్నల్స్, జీబ్రా క్రాసింగ్ వద్ద రోడ్డును దాటాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రిబుల్ డ్రైవింగ్, మొబైల్ మాట్లాడుతూ వాహనాలు నడిపి ప్రమాదాలను కొని తెచ్చుకోవద్దన్నారు. కార్యక్రమంలో పాఠశాలకు చెందిన 200 మంది విద్యార్థులు, అధ్యాపక బృందం, అల్వాల్ ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌సీయూకు ప్రపంచ స్థాయి గుర్తింపు

క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్-2026 విడుదల



హెచ్‌సీయూ పరిపాలనాభవనం

రాయదుర్గం: ప్రపంచవ్యాప్తంగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి మరోసారి గుర్తింపు లభించింది. క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్-2026లో 801-850వ స్థానంలో నిలిచింది. కాగా,'సైటేషన్స్ ఫర్ ఫ్యాకల్టీ కేటగిరీలో 335వ స్థానంలో నిలవడం విశేషం. ర్యాంకింగ్స్ ప్రకారం హెచ్‌సీయూ ప్రపంచంలోని అగ్రశ్రేణి యూనివర్సిటీలలో ఒకటిగా పేరొందింది. గ్లోబల్ ఉన్నత విద్యా విశ్లేషణ చేసే క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్-2026ను గురువారం విడుదల చేశారు. ఈ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా 8,467 ఉన్నత విద్యా సంస్థలను మూల్యాంకనం చేసి వాటి పనితీరు ఆధారంగా ర్యాంకింగ్స్‌ను ప్రకటించింది. ప్రధానంగా స్థిరత్వం, ఉపాధి అవకాశాలు, అంతర్జాతీయ పరిశోధన, నెట్‌వర్క్, విద్యా ఖ్యాతి, అధ్యాపక విద్యార్థి నిష్పత్తి వంటి అంశాలలో పనితీరును పరిశీలించి పలువురి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని ఈ ర్యాంకింగ్స్‌ను ప్రకటించడం విశేషం.

హెచ్‌సీయూకు వచ్చిన ర్యాంకింగ్స్-2026 వివరాలు

కేటగిరీ	ర్యాంకు
ఓవరాల్‌గా వచ్చిన ర్యాంకింగ్	801-850
సిటేషన్స్ ఫర్ ఫ్యాకల్టీ	335 ర్యాంకు
ఎంప్లాయిర్ రెపుటేషన్	692 ర్యాంకు
ఉపాధి అవకాశాల పరిస్థితిలో	801 ర్యాంకు
విద్యార్థులు, ఫ్యాకల్టీ శాతం	801 ర్యాంకు
అంతర్జాతీయ విద్యార్థుల వైవిధ్యం	801 ర్యాంకు
అంతర్జాతీయ పరిశోధనా నెట్‌వర్క్	801 ర్యాంకు
అంతర్జాతీయ విద్యార్థులు	801 ర్యాంకు
స్థిరత్వం	801 ర్యాంకు

మా అధ్యాపకుల అంకితభావానికి నిదర్శనం



హెచ్‌సీయూలోని అధ్యాపకులు, పరిశోధకుల అంకితభావానికి, కృషికి నిదర్శనంగా ఈ ర్యాంకింగ్స్ చెప్పుకోవచ్చు. క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్-2026లో 'సైటేషన్స్ ఫర్ ఫ్యాకల్టీ'కేటగిరీలో ప్రపంచంలో 335వ ర్యాంకింగ్‌ను సాధించడం చాలా సంతోషంగా ఉంది. పరిశోధన, విద్యలో రాణించడానికి నిరంతరం కృషి చేయడం ద్వారా మా మొత్తం ర్యాంకింగ్‌ను మెరుగు పరచడానికి కట్టుబడి ఉన్నాం. ఈ గుర్తింపు మమ్మల్ని ప్రపంచ విద్యారంగంలో ఎక్కువ ప్రభావాన్ని చూపడానికి ప్రేరేపిస్తుంది.

– ప్రొఫెసర్ బీజేరావు,
వైస్ చాన్సలర్, హెచ్‌సీయూ గచ్చిబౌలి

రహదారిపై వ్యర్థాలు..పట్టించుకోని అధికారులు



నల్లగండ్ల హుడా కాలనీ చౌరస్తా ప్రధాన రోడ్డులో వ్యర్థాలు

శేరిలింగంపల్లి: ప్రధాన రోడ్డుపై పేరుకుపోయిన మట్టిని శానిటేషన్ సిబ్బంది మట్టికుప్పలుగా పోశారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల హుడా కాలనీ చౌరస్తా నుంచి తెల్లాపూర్ వెళ్ళే ప్రధాన రోడ్డులో డివైడర్ పక్కనే మట్టివ్యర్థాలు పేరుకుపోయాయి. 15 రోజుల క్రితం వేసిన ఈ వ్యర్థాలను తొలగించకుండా అక్కడే ఉంచారు. ఆ వ్యర్థాలను తొలగించకపోవడంతో వర్షాలకు తిరిగి రోడ్డుపైకి మట్టి వస్తోంది. కుప్పలు చేసిన మట్టిని తొలగించాలని రాంకీ సంస్థకు శానిటేషన్ సిబ్బంది సమాచారం ఇచ్చినప్పటికీ, తాము చెత్తను తరలిస్తామే కానీ, మట్టి కుప్పలను కాదని దానిని తొలగించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా ప్రధాన రోడ్డుపై ఉన్న మట్టికుప్పలను వెంటనే తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

రైతులందరికీ రైతు భరోసా

మంత్రి తుమ్మలను కోరిన కాటా



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న కాట శ్రీనివాస్‌గౌడ్

పటాన్‌చెరు: పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని రైతులందరికీ రైతు భరోసా పథకాన్ని వర్తింప చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక నాయకులతో ఆయన కలసి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు వినతి పత్రం సమర్పించారు. ఈ ప్రాంతంలోని గుమ్మడిదల రైతుల మాత్రమే రైతుభరోసా నిధులు వస్తున్నాయని మిగతా వారికి రావడం లేదని వివరించారు. ఈ ప్రాంతంలో కొందరు రైతులు భూములను అమ్ముకోకుండా వాటినే నేటికీ సాగు చేసుకుంటు జీవిస్తున్నారని ఆయన మంత్రికి వివరించారు. మొత్తం 27,120 మంది రైతులు 43,302 ఎకరాల్లో సాగు చేస్తున్నారని వివరించారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారని అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుతుందన్నారు.

యోగా డేను విజయవంతం చేయాలి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి




పాఠశాల గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు/జిన్నారం (పటాన్‌చెరు): అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 21న శనివారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు పటాన్‌చెరు డివిజన్‌లోని మైత్రి మైదానంలో యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని ఇందులో ప్రతీ ఒక్కరూ పాల్గొనవచ్చని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం వివిధ శాఖల అధికారులు, యోగా నిర్వహణ కమిటీ సభ్యులతో సమీక్షించారు. అంతకుముందు బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సుమారు రూ.37.50 లక్షల వ్యయంతో నిర్మించిన పాఠశాల అదనపు గదులను ప్రారంభించారు. అనంతరం మైత్రి మైదానంలో యోగా దినోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..యోగ ప్రాముఖ్యతను ప్రతీ ఒక్కరికి తెలియజేయాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమంలో నిర్వహిస్తున్నామన్నారు. యోగా ద్వారా పరిపూర్ణమైన మానసిక సమతుల్యత ఏర్పడుతుందని మహిపాల్‌రెడ్డి వివరించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. అదనంగా రూ.25 లక్షల సీఎస్‌ఆర్ నిధులతో తరగతి గదులకు పెయింటింగ్, ఫ్లోరింగ్, బొమ్మలు, క్రీడా ప్రాంగణాలను ఆధునీకరించినట్లు వెల్లడించారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయనున్నామని చెప్పారు. కార్యక్రమంలో కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో అరుణరెడ్డి, మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి, చంద్రారెడ్డి, హనుమంత్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్



బండి రమేష్‌కు సమస్యలు వివరిస్తున్న ప్రజలు

కూకట్‌పల్లి: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్ అన్నారు. గురువారం నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి విస్తృతంగా పర్యటించారు. బాలానగర్ డివిజన్ రాజీవ్‌గాంధీ నగర్, ఎన్టీఆర్ నగర్‌లలో స్థానిక నాయకులతో కలిసి అభివృద్ధి పనులను పరిశీలించారు. కొత్తగా నిర్మించిన ఈద్గాలో సౌకర్యాలను పరిశీలించారు. బస్తీల్లో రహదారులు, కమ్యూనిటీ హాల్ లేకపోవంతో తాము ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి ఆ రహదారులకు ఎస్టిమేషన్ వేయడం జరిగింది. పనులు త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. అదే విధంగా స్థానికంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను కబ్జాకు గురి కాకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎక్స్ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, మార్కెటింగ్ కమిటీ చైర్మన్ పుష్పారెడ్డి, వైస్ చైర్మన్ ప్రకాష్, పులి శ్రీకాంత్ పటేల్, పులి శివకుమార్ గౌడ్, బాల నరసింహ, హుస్సేన్, శ్రీనివాస్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానించిన సీపీఐ నాయకులు

బాలానగర్: బాలానగర్ డివిజన్ పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్‌లో గురువారం టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్ పాదయాత్ర నిర్వహించారు. అనంతరం శ్రీశ్రీ నగర్‌లోని సీపీఐ పార్టీ కార్యాలయంలో బండి రమేష్‌ను నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కృష్ణ, మనోహర్‌చారి, రాజు, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

రాయదుర్గం: గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆర్టీసీ బస్ డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి శుక్రవారం 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ మురళీధర్‌రెడ్డి గురువారం తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. బస్సుల వేళలు, సమయపాలన, ఇతరసమస్యలు ఉంటే ప్రయాణికులు తమకు ఫోన్ ద్వారా తెలిపితే వాటిని పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. 9959226132నెంబరుకు ఫోన్ చేయాలన్నారు.

'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమం

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా 'యస్ ఇన్‌స్పిరేషనల్ లైఫ్ స్టోరీ ఆఫ్ మాతేశ్వరి జగదాంబాసరస్వతి' అంశంపై బ్రహ్మకుమారీస్ సంస్థ రూరల్ అండ్ అగ్రికల్చర్ డెవలప్‌మెంట్ వింగ్ వైస్ చైర్మన్ బి.కె.రాజు ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

పటాన్‌చెరు టౌన్: కేంద్రంలోని మోదీ సర్కారు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా జూలై 9న తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెను కార్మిక, కర్షక లోకం విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజయ్య పిలుపునిచ్చారు. పటాన్‌చెరు మండలం రుద్రారం శివారులో గల తోషిబా, కాజీపల్లి పారిశ్రామిక వాడలోని టీఐటీసీ పరిశ్రమల్లో గురువారం జరిగిన కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రధాని మోదీ అనుసరిస్తున్న విధానాలపై కార్మికులు, కర్షకులు తిరగబడాలన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లకు రద్దు కోసం పోరాడాలని చెప్పారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కుత్బుల్లాపూర్: ప్రభుత్వ పథకాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జగద్గిరి గుట్ట డివిజన్ కార్పొరేటర్ జగన్ అన్నారు. మగ్దూమ్‌నగర్‌కు చెందిన శ్రీనివాస్(37) అనారోగ్యంతో బాధ పడుతుండగా కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే వివేకానంద్‌ను ఆశ్రయించారు. దీంతో స్పందించిన ఆయన రూ. 2 లక్షల సీఎం రిలీఫ్‌ఫండ్ నిధులు మంజూరయ్యేలా కృషి చేశారు. సదరు ఎల్‌ఓసీ పత్రాన్ని గురువారం చింతల్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జగన్ బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు రుద్ర అశోక్, నాయకులు పాపులుగౌడ్, సాజిద్, మద్ది శ్రీనివాస్, జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలి

కూకట్‌పల్లి: తెలంగాణ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి, పాఠశాల సంచాలకులు యోగితా రాణాను గురువారం రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా లాంగ్వేజ్ పండితులు 680 మందికి పదోన్నతులు రాక ఆందోళన చెందుతున్నారని, వారికి ప్రమోషన్ కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి ఆమె స్పందించి అధికారులతో సంప్రదించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ అధ్యక్షులు వీఎస్ఎస్ శర్మ, ప్రధాన కార్యదర్శి రోహిత్‌కుమార్, జిల్లా కోశాధికారి దినకర్ దేశ్‌పాండే, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు హమీద్ ఖాన్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని కొట్టి.. మోకాళ్లపై నిలబెట్టి..

- సమయానికి కాలేజీకి రాలేదని విద్యార్థిపై దాడి
- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విద్యార్థి తల్లి

మియాపూర్ : కళాశాలకు విద్యార్థి సమయానికి రాలేదంటూ ప్రైవేటు కళాశాల సిబ్బంది విద్యార్థిని చితకబాదారు. ఈ సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కళాశాల యాజమన్యంపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి కుటుంబ సభ్యులు మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో గురువారం పిర్యాదు చేశారు. పోలీసులు, విద్యార్థి తల్లి రేఖ, అక్క శ్వేత తెలిపిన మేరకు.. మియాపూర్‌లోని మాతృశ్రీనగర్ కాలనీలో శ్రీఆధ్యా జూనియర్ కళాశాలలో కనిష్కరెడ్డి ఇంటర్మీయట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కనిష్కరెడ్డి కళాశాలకు ఆరు నిమిషాలు ఆలస్యంగా రావడంతో కళాశాల డైరెక్టర్ బాలకృష్ణ విద్యార్థిని కొట్టడంతో పాటు బయట నిల్చోబెట్టాడు. అదేవిధంగా మోకాళ్లపై కూర్చోబెట్టి గుంజీలు తీయించి విద్యార్థి పట్ల దారుణంగా ప్రవర్తించి కొట్టాడు. అదేరోజు సాయంత్రం సమయంలో విద్యార్థి కనిష్క నీరసంగా ఇంటికి వెళ్లగా కుటుంబ సభ్యులు ప్రశ్నించగా కళాశాల డైరెక్టర్ బాలకృష్ణ కొట్టాడని తెలిపాడు. దీంతో తల్లి రేఖ, అక్క శ్వేత కళాశాలకు వెళ్లి డైరెక్టర్ బాలకృష్ణను ప్రశ్నించగా తల్లి, అక్కపై దురుసుగా, అసభ్యకరంగా మాట్లాడి బెదిరించి సిబ్బందితో బయటకు వెళ్లగొట్టించాడు. దీంతో పాఠశాల డైరెక్టర్ బాలకృష్ణ, ప్రిన్సిపాల్ మానసపై చర్యలు తీసుకోవాలని తల్లి రేఖ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ప్రత్యేక అలంకరణలో రాజరాజేశ్వరిమాత



జీపీఆర్‌ఏక్వార్టర్స్‌లోని ఆలయంలో ప్రత్యేక అలంకారంలో రాజరాజేశ్వరిమాత

రాయదుర్గం: రాజరాజేశ్వరిమాత పుట్టిన రోజు వేడుకలను ఘనంగా గురువారం నిర్వహించారు. గచ్చిబౌలి జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరిసమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో అమ్మవారి పుట్టినరోజును పురస్కరించుకొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయంలో ఉదయం 8.30 గంటలనుంచి మొదట అమ్మవారికి అర్చన, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



చందానగర్ : కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటి సభ్యులు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వి.జగదీశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం చందానగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద రాహుల్ గాంధీ చిత్రపటానికి ఆయన పాలాభిషేకం చేసిన జన్మదిన కేక్ కట్ చేసి, పారిశుధ్య కార్మికులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర లేబర్ సెల్ ఉపాధ్యక్షులు నల్ల సంజీవరెడ్డి, కోఆర్డినేటర్ రఘునందన్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

శేరిలింగంపల్లి: విద్యుత్ మరమ్మతుల కారణంగా హుడా కాలనీ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాను శుక్రవారం నిలిపివేయనున్నట్లు నల్లగండ్ల ఏఈ వెంకట్‌నారాయణరెడ్డి తెలిపారు.

☛ 11 కేవీ చందానగర్ హుడా కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు. ఫీడర్ పరిధిలోని హుడా కాలనీ, ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ రోడ్డు, విద్యావాణిస్కూల్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

చందానగర్ : వేమనకాలనీ, చందానగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

☛ శంకర్‌నగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గౌతమీనగర్, వార్డు కార్యాలయం, బాజాజ్ ఎలక్ట్రానిక్స్, శిల్పా ఎన్‌క్లేవ్ ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

☛ భిక్షపతి ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జవహర్ కాలనీ రోడ్డు నెంబర్ 4,5,6, కైలాష్‌నగర్, ఎస్వీఎస్ ఇన్ఫ్రా లిమిటెడ్, భిక్షపతి ఎన్‌క్లేవ్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

☛ శ్రీరాంనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శ్రీరాంనగర్, అన్నపూర్ణ ఎన్‌క్లేవ్, కిన్నెర హోటల్, గంగారం ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

చందానగర్ సెక్షన్ పరిధిలో...

హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ దీప్తి పేర్కొన్నారు.

☛ ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం9 నుంచి మధ్యాహ్నం 12 గంటల ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీ, సప్తగిరి కాలనీ, మైత్రీనగర్ ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

☛ హుడా కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు చందానగర్, హుడా కాలనీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా



ఎల్లమ్మబండలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ, కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఆల్విన్‌కాలనీ, హైదర్‌నగర్ డివిజన్‌ల పరిధిలోని పలు అభివృద్ధి కార్యక్రమాలను గురువారం కార్పొరేటర్‌లు దొడ్ల వెంకటేష్‌గౌడ్, నార్నే శ్రీనివాసరావులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలని, నాణ్యతలో రాజీపడేది లేదన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో శ్మశాన వాటికలను నిర్మించుకోవటం ఆనందించదగ్గ విషయమన్నారు.

ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయాలి



నిరసన తెలుపుతున్న బీజేపీ శ్రేణులు

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతినగర్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని గురువారం బీజేపీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్‌కు నివేదించినా మార్పు లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఆలీఫ్ సర్కిల్, ఐకానిక్స్ సర్కిల్, మూడు కోతుల జంక్షన్ వద్ద స్కూల్ బస్సులు, ఉద్యోగుల పికప్ బస్సులు, ఆలీఫ్ ఇండస్ట్రియల్‌కు సంబంధించిన వాహనాలు, నీటి ట్యాంకర్లు, ప్రైవేట్ వాహనాలతో అనునిత్యం రద్దీగా మారిందన్నారు. ఈ మేరకు మియాపూర్ ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ స్పందించి.. ఫీల్డ్ వెరిఫికేషన్ చేసి ట్రాఫిక్ కానిస్టేబుల్స్‌ను జంక్షన్ వద్ద ఉండేలా చూస్తామని తెలిపారు. అదేవిధంగా పై అధికారులకు వివరించి ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుకు చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నరేంద్ర చౌదరి, డాక్టర్ రాజు, సుమన్‌రావు, రవి యాదవ్, మదన్ మోహన్, కిషోర్, మందపాటి శ్రీధర్‌రెడ్డి, సత్యనారాయణ, శివకుమార్‌గుప్తా, నరేష్, రామకృష్ణ, లక్ష్మి, కోశాధికారి రవి, అనిరుద్ర, వేణుమాధవ్, రాహుల్ పాల్గొన్నారు.